# మనసున్న బతుకు




'దొంగ సచ్చినోడు, ఇంకా రాలేదు. ఎక్కడ తాగి తందనాలాడుతున్నాడో' అనుకుంది కాంతం.

వీధిలైటు వెలుగు అక్కడిదాకా వస్తుంది.అ లా ఆ వెలుగులో పాకబైట గుమ్మానికానుకుని కూచోటం, వీధిలైటు వేపు చూస్తూ ఎదురు చూట్టం ఎన్నాళ్ళగానో అలవాటైంది కాంతానికి.

ఆ సమయంలో వ్యాపారాని కంత అవకాశం వుండదు. రెండో ఆట వదిలేశాక వస్తేగిస్తే ఎవరేనా రావాలి. మరో  గంట దాటితేగానీ సినిమా వొదిలే వేళవదు.

అలా అని అక్కడ కూచోటం ఏనాడూ మానలేదు కాంతం. పాకలో ఆ చీకట్లో వుండటం కన్నా అలా గుమ్మంలో కూచుని వెలుగువేపు చూట్టమే బావుంటుంది కాంతానికి.

మొదట్లో అలా వెలుగులో గుమ్మం దగ్గరుంటే వచ్చేపోయేాళ్ళ దృష్టిలో పడచ్చు అనుకునేది.

గుమ్మానికి నడుం ఆన్చి కూచోటంలో వీలుగా సవనగా వుండేది. అదే క్రమేపీ అలవాటుగా మారింది.

చీకటినది వొడ్డున వొంటరి దీపంలా ఆ పాకముందు అర్థరాత్రి వొంటరిగా అలా కూచున్నప్పుడల్లా కాంతం కళ్లు, మనసు ఎదురు చూస్తుంటాయి. కళ్లు, ఎవరేనా తన శరీరాన్ని కొనుక్కునే వాళ్ళు వస్తారేమో అని... మనసు పోలయ్య వస్తాడేమోనని, రెండింటిలో ఏది జరిగితే ఎక్కువ తృప్తో కాంతానికే తెలియదు.

పోలయ్య రావటానికి యిదంటూ వో టైము లేదు. రాత్రిళ్ళు మాత్రం సాధారణంగా పన్నిండింటిలోపు వచ్చేవాడు కాదు. పన్నెండు దాటింతర్వాత ఎప్పుడొ వాడిష్టం. వాడొచ్చాక ఎవరొచ్చినా వొప్పుకునేది కాదు కాంతం. వొక వేళ వాడొచ్చేటప్పటికి ఎవరేనా వుంటే.... పాక తలుపు వేసేసి వుంటే... లోపలి మనిషి వెళ్ళేవరకూ రిక్షా ఆపుకుని పాక గుమ్మం దగ్గరే కూచునేవాడు.

అలాంటప్పుడు బైటకొచ్చిన కాంతం పోలయ్యని చూసి... "ఎంత సేపయింది వొచ్చి..." అనడిగేది.

అరగంటయినా, అయిదు నిముషాలైనా... "యిప్పుడే" అనేవాడు తాక్కుండా వొచ్చినరోజు... తాగొస్తే మాత్రం సమాధానం చెప్పకుండా అడ్డమైన బూతులూ తిట్టేవాడు.

వీధి చివర్నించి ఏదో రిక్షా వస్తుంటే కళ్ళు చిట్లించి మరీ చూసింది కాంతం. వీధిలైటు దగ్గరకొచ్చాక రిక్షా తొక్కుతున్నది పోలయ్య కాదని ఆనమాలు తెలిసింది.

ఆరోజెందుకనో పోలయ్య తొందరగా వొచ్చేస్తే బావుణ్ణనివుంది కాంతానికి. చీకటి పడగానే వచ్చిన రెండు బేరాలు అయేటప్పటికి వొళ్లు నీరసంగా వున్నట్టనిపించింది. ఆ నీరసం మీదే అన్నం కూడా తినేసింది.

సాధారణంగా పోలయ్య వచ్చాక కలిసి తినే అలవాటు. ఏదేనా రోజు ముందు తినేస్తే....'వాడేమేనా తిన్నాడో లేదో, టీయేనా తాగాడోలేదో...' అన్న ఆలోచన వొకటికి రెండుసార్లొస్తుంది కాంతానికి.

'తాగటానికెడితే ఆ ద్యాసే తప్ప, తిండి ద్యాసే వుండదు...' అనుకుంది ఎంతకీ వాడొచ్చే జాడ కనిపించకపోతే.

ఎవరో మనిషి పాక ముందు నుంచి వెడుతూ కాంతంవేపు చూస్తూ చూస్తూ వెళ్ళాడు. ఆ మనిషి సందు చివరి దాకా వెళ్ళటం కనిపిస్తూనే వుంది. కానీ ఆ రోడ్డు ఖాళీగా ఎవరూ లేనట్టే కనపడింది కాంతానికి. ఆ వీధి వీధంతటికీ వొంటరిగా తానొక్కత్తె వున్నట్టుంది.

యిప్పుడే కాదు యిలా చాలాసార్లనిపించింది. ఎంతో దగ్గరగా... తన వొంటిని అతుక్కుపోయినట్టు పడుకుని ఎవరెవరో ఏదో వాగుతున్నా తను వొంటరిగా వున్నట్టే వుండేది చాలాసార్లు. పక్కనే మనుషులున్నా ఆ వొంటరితనమేమిటో ఎప్పుడూ అర్థం కాలేదు కాంతానికి.

కిందటేడాదివరకూ పోలయ్య తనకి దగ్గరవని వరకూ.... మరీ వొంటరిగా వుండేది. ఇదివరకంత కాకపోయినా యిప్పుడూ అప్పుడప్పుడు అలాగే వొంటరిగా అనిపిస్తుంది. అలా అనిపించినప్పుడు మటుకు కావాలనే పోలయ్య మీదికి తిప్పుకుంటుంది మనసుని కాంతం.

వాడి మాటలు... వాడి తాగుడు... వాడి తిట్లు.... ఒక్కోసారి వొళ్ళెరక్కుండా వాడు తన్నే తన్నులు... ఏదేనాసరే... అన్నింటికన్నా కాంతానికి ఎక్కువగా గుర్తొచ్చేది పోలయ్య మొదటిసారి తన దగ్గరకొచ్చిన రాత్రి.

అదైనా.... ఆ రాత్రి జరిగిందంతా వొక్కసారి గుర్తుకొచ్చేది కాదు.

మనిషెవరో తిన్నగా కనపడని ఆ మసక వెలుగులో పాక బైట నిలబడున్న తన దగ్గరికి తూలుతూ

వాడు రావటం, ఎంతని అడగటం.... తను చెప్పింది తిన్నగా వినకుండానే ఓ నోటు తన చేతిలో పెట్టి పాకలోకి పడిపోతున్నట్టు పోలయ్య రావటం వోసారి గుర్తొస్తే... లోపలికొచ్చి తిన్నగా తనవేపు చూడనేనా చూడకుండా పక్కమీద పడిపోటం మరోసారి గుర్తొచ్చేది.

అన్నింటికన్నా, తెల్లారి లేచి తనవేపు చూసి చిన్నకుర్రాడిలా సిగ్గుపడిన వాడి నిద్రముఖమే ఎక్కువ గుర్తొచ్చేది కాంతానికి.

ఆ రాత్రి తాలుకు అనుభవాలు ఒక్కొక్కటీ గుర్తొచ్చినా, కలగా పులగంగా గుర్తొచ్చినా కాంతానికి యేదో వుపశమనంగా వుంటుంది. అందుకే అవంటే... అవి తలుచుకోటమంటే యిష్టం.

ఆ రాత్రి తెల్లారాక నిద్రలేచి వెళ్ళిపోతున్న పోలయ్యకి రాత్రి యిచ్చిన నోటు యిచ్చేయబోయింది.

"ఉంచు.... రాత్రికొస్తాగా..." అన్నాడు తలొంచుకుని వెళ్ళిపోతూ.

రాత్రి నిజంగానే వచ్చాడు... ఆ తర్వాత చాలాసార్లు వచ్చాడు.

అలా వచ్చీ పోవటంలోనే యిద్దరి మధ్యా డబ్బు విషయంలో కట్టుబాటు కొంచెం తగ్గింది. వున్నరోజు ఇచ్చేవాడు. ఒకోరోజు యిచ్చేవాడు కాదు. ఒకోసారి మామూలుకన్నా ఎక్కువిచ్చేవాడు.

రెండు మూడు నెలలు గడిచేటప్పటికి యిద్దరి పాత జీవితాలు ఒకళ్ళకొకళ్ళకి కొంచెం తెలిసాయి. కలిసి గడుపుతున్న ఆ కాసేపటి అనుభవమే కాక మిగిలిన రోజంతా యిద్దరూ గడిపే కష్టసుఖాలు కొన్ని తెలిశాయి... అలా నెమ్మది నెమ్మదిగా డబ్బిచ్చి కొనుక్కున్న శరీరాన్ని అనుభవించి వెళ్ళిపోయే బేరగాడి పరిధిని దాటాడు కాంతం విషయంలో పోలయ్య.

తాగొచ్చి తనని కలిసింతర్వాత కూడా యింకా స్పృహలో వుంటే పోలయ్య చాలా చాలా మాట్లాడేవాడు. అందులో ఆరోజు జరిగిన గొడవలుండేవి... వాడి పాతబతుకు గొడవలుండేవి. ఆ సమయంలో వాడు అలా మాట్లాడుతుంటే ఎంతో దగ్గరగా బావుండేది కాంతానికి. ఓసారి ఆ మాటల్లోనే... లేచిపోయిన పెళ్ళాం సంగతి చెప్పాడు... పోయింది పోక రంకు మొగుడితో వొచ్చి దెబ్బలాడి పాకలో తట్టా బుట్టా అంతా తనదేనని తీసుకుపోవటం, ఆ క్షణంతోనే ఆ మనిషంటే, ఆ వూరంటే మనసువిరిగి ఏలూరు రావడం గురించి చెప్పాడు. అలా చెపుతూనే...

"ఏంటో కాంతం. రిక్షా లాగి లాగి వొళ్ళలిస్తే తాగాలనుంటది. తాగినప్పుడు వొకోసారి ఆడది కావాలనిపించటం... డబ్బిచ్చే, యివ్వకో ఎవరి దగ్గరో పడుకోడం... యింత చేసినా ఏంటో వొకోసారి బావుండదు. దీనికన్నా యింకా ఏదేదో కావాల్నుంటది. అదేంటోమరి..." అన్నాడు.

వాడు చెప్పింది కొంత అర్థమైంది. కొంత అర్థం కాలేదు కాంతానికి. అలాగే చాలాసార్లు చాలా అర్థం అయి అవనివి ఎన్నో వాగేవాడు పోలయ్య.

ఒకోసారి వాడు వాగిన వాటి గురించి ఆలోచించేది... ఒకోసారి ఏదో తిక్కవాగుడు లెద్దూ అని కొట్టిపారేసేది.

పోలయ్య వస్తున్నాడు... వెడుతున్నాడు. వాడి రాకవల్ల ఏదో కొంత అండ దొరికినట్లుంది. ముఖ్యంగా రౌడీ మస్తాన్నుంచి, అందరి పాకలకన్నా ఎక్కువసార్లు తన పాకకి వొచ్చి మామూలు మామూలని పీక్కుతినే వాడి ధోరణి కొంత తగ్గింది. దానికి చాలవరకూ పోలయ్య భయమే కారణమని కాంతానికి తెలుసు. ఓసారి ఏదో గొడవలో పోలయ్య మస్తాన్ని చితకతన్నిన సంగతి ఆ పాకల వాళ్ళందరికీ తెలుసు.

ఇలా ఏదో కొంచం మంచే తప్ప, చెడేం జరగకపోవటంవల్ల పోలయ్య గురించి పెద్దగా ఆలోచ

నెప్పుడూ సాగలేదు కాంతానికి.

కానీ వోరోజు పక్క పాకలో సావిత్రి అలా అన్నాక కొంత ఆలోచించింది.

"అవును వాడికీ తనకీ సంబంధం ఏమిటి... ఎన్నాళ్ళుంటుంది ఈ యిష్టం వాడికి తన మీద. రేపొద్దున్న తనకన్నా యింకొకత్తె వత్తేనా కంటికి నదురుగా కనిపించి వెళ్ళిపోతే..... తనేం జాగ్రత్త పడు తోంది..." ఇలాంటి ఆలోచనలు చాలాసేపు బాధపెట్టాయి కాంతాన్ని.

సావిత్రి అన్నదాంట్లోనూ తప్పు కనపళ్ళేదు. ఆరోజు భోం చేస్తుండగా వచ్చింది సావిత్రి. కాసేపు ఆమాటా ఈ మాటా అయ్యాక.... "ఆ పోలయ్య దగ్గరేమేనా తీసుకుంటున్నావా.... ఏమేనా జాగ్రత్త చేశావా...." అంది.

తనేం మాట్లాడకపోవటం చూసి....

"వీళ్ళెవరూ మనకి తాళికట్టినోళ్లు కాదు.... కలకాలం వుండిపోటానికి. ఎప్పుడు మొఖం మొత్తుద్దో చెప్పలేం. ఇలా పెర్మనెంటు ఖాతా తగిల్నప్పుడే కొంచం జాగ్రత్తపడి నాలుగు డబ్బులు వెనకేసు కోవాలి...." అంది.

పెర్మనెంట్ ఖాతా అన్నమాటే యిబ్బందిగా అనిపించింది కాంతానికి. వాళ్ళ బతుకుల్లో వాళ్ళు వాడుకునే భాషా, మాటా అదే అయినా ఎందుకో అది తలుచుకుంటేనే చాలా అసహ్యంగా తోచింది. దాని తర్వాత వొచ్చిన ఆలోచన్లు మరీ యిబ్బందిగా అనిపించాయి.

ఆ తర్వాత కొన్నాళ్లు మనసు వెనకా ముందూలాడినా కాంతం వో నిర్ణయానికొచ్చేసింది. ముందు ముందు ఏమైనా ప్రస్తుతం పోలయ్య తనకి కావాలి. వాడు పెట్టినా పెట్టకపోయినా, రోజూ తన సంపాదనే తిన్నా వాడు కావాలి.

వాడి దగ్గర్నించి ఏం కావాలో, ఏం పొందాలో తెలియక పోయినా ఆ నిర్ణయానికొచ్చాక కాంతం మనసు కుదుటపడింది.

రోజులు గడుస్తూనే వున్నాయి... కలిసి తింటం... కలిసి పడుకోటం... తిట్టుకోటం... ఒకోసారి కొట్టుకోటం... యిద్దరి జీవితం గడుస్తోంది. పరస్పరం వొకళ్ళ దగ్గర్నించి వొకళ్ళు ఏం పొందుతున్నారో, ఏం సంపాదించుకుంటున్నారో వాళ్ళకే తెలియకుండా యాడాది దాటింది.

ఆలోచనల్లో కూరుకుపోయి, తల మోకాళ్ల మీద ఆన్చుకు కూచున్న కాంతం అలికిడికి తలెత్తి చూసింది. రెండు మూడు రిక్షాలు కలిసి వస్తున్నాయి. కాంతం పూర్తిగా తేరుకునే లోపలే వొచ్చి పాకముందు ఆగాయి.

ముందు రిక్షాలోంచి దింపి భుజాల మీద సాయంపట్టి తీసుకొచ్చారు.

"ఏంటి... ఏం జరిగింది....?" అంటూ కంగారుపడింది కాంతం.

పోలయ్య తలకి పెద్దగా తెల్లటి కట్టుంది. చేతులకి, కాళ్ళకి కూడా చిన్న చిన్న కట్లున్నాయి.

"ఏం లేదు; సెంటర్లో ఏదో గలాటాలో కెళ్ళాడు. నలుగురైదుగురున్నారు. మేం ఎల్లేటప్పటికే మోపుగా దెబ్బలు తగిలాయి. మరేం కంగారు లేదులే... డాటరుకి చూపించాం... యిదిగో చీటీ... పొద్దున్నే మందులు కొని ఎయ్యి.... యిప్పుడు కొట్టుల్లేవు..." అని చెప్పి, పోలయ్యని పాకలో పడుకోపెట్టి, రిక్షాని పాకముందు పెట్టి వెళ్లిపోయారు, వాణ్ణి తీసుకొచ్చిన రిక్షావాళ్లు.

అప్పటిదాకా వున్న నీరసమంతా వొక్కసారి పోయింది. కాంతానికి. అదురుతున్న గుండెల్తో

దీపం బాగా పెద్దది చేసి పోలయ్యవేపు చూసింది. కళ్ళు మూసుకునే వున్నాడు. బాగా మూలుగుతున్నాడు. తెల్లటి కట్టుతో సగం నుదురు కప్పడిపోయింది.

కాస్సేపటికి నెమ్మదిగా వాడి కాళ్ళకున్న చెప్పులు తీసింది. వాడి బట్టలు, పక్క సర్దింది. పక్కనే వాడివేపే చూస్తూ కూచుంది. యింకాసేపటికి కొంచం భయం వేసింది కాంతానికి. గుండె తట్టుకోలేనంత దిగులు పుట్టింది. మరీ ఆపుకోలేక కొంగు నోట్లో కుక్కుకుని ఏడిచింది.

★ ★ ★

మూడురోజులు గడడిచినా పోలయ్య తిన్నగా కోలుకోలేదు. రోజూ డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి మందు వేయిస్తూనే వుంది. వాళ్ళు చెప్పిన మందులు, యింజెక్షన్లు కొంది. చేతిలో డబ్బులేకపోతే సావిత్రి నడిగింది. ఎప్పుడేనా అవసరం వొస్తే తననే అడుగుతుంది... సావిత్రీ అంతే. హాస్పిటల్‌కి తీసికెళ్ళి తీసుకు రావటానికి పోలయ్య తోటి రిక్షా వాళ్ళే ఎవళ్ళో ఒకళ్ళు వచ్చేవాళ్లు. వాళ్ళనీ అడిగింది. మరో రెండు రోజులు గడిచేటప్పటికి కాంతానికి తప్పలేదు.

పోలయ్య పక్కని పాకలో అటువేపుకి... రోజూ వంట చేసుకునే చోటుకి. పాకని రెండుగా చేస్తున్న చిన్న గోడవతలికి మార్చింది.

జ్వరం ఎక్కువగా వున్నా పోలయ్య తెలివిగానే వుంటున్నాడు. దెబ్బల బాధకి, జ్వరానికి నిద్దరపట్టక తాగుడు తెమ్మనమని వూరికే గోల చేస్తుంటే బతిమాలి, బెదిరించి ఎలాగో ఆపుతూ వొచ్చింది.

ఆ సమయంలో పోలయ్య తెలివిగానే వున్నాడని తెలుసు... అయినా తప్పదని తెలిసి బేరం వొప్పుకుంది కాంతం. వచ్చిన మనిషి ఏ గొడవా, వాగుడూ లేకుండా వుంటే బావున్నని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఆ పాకలోకి తమని తాము మరిచిపోవటానికొచ్చినవాళ్లు, మరిచిపోయి వొచ్చినవాళ్ళు అందరూ అలా వుండలేదు. కొందరు ఏ గొడవా గోలా లేకుండా వొచ్చిన సంగతే తెలియనంత నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

కొందరు మాత్రం అలా వెళ్ళలేరు. చిన్న చిన్న అరుపులూ.... బూతులూ, అల్లరి... మోటుగా సరసాలు... వాటన్నింటికీ ఏనాడో అలవాటుపడిపోయిన కాంతానికి అవన్నీ భరించటం పెద్ద బాధనిపించ లేదు. కానీ పక్కన పోలయ్య వున్నాడన్న భావన మనసులో మెదిలినప్పుడల్లా గుండె విలవిల్లాడేది తనకి, ఆ క్షణాన.... సిగ్గుతోటి బాధతోటి, చచ్చిపోతున్న వొళ్లు తనకి లేకుండాపోతే బావుణ్ణనిపించింది. ఎంతమంది చేతుల్లో నలిగినా యింకా తన వొంట్లో చీమూ, నెత్తురూ వున్నందుకు బాధనిపించింది.

తన పక్కనే జరుగుతున్న గొడవలకి పోలయ్య ఏం అంటాడోనని భయపడింది కాంతం.

కానీ పోలయ్య ఏం అనకపోవటంతో కాంతం మనసు కుదుటపడింది. ఆ తర్వాత గుండె కలుక్కుమనేలా బాధ కలిగింది, పోలయ్య ఆ విషయం గురించి ఏం అననందుకు. 'నా కళ్ళముందు నాకు తెలిసేలా యిదేంటి.... నీకు సిగ్గులేదూ' అని తిట్టినా, విసుక్కున్నా బావుణ్ననిపించింది.

అంత కోపంగా, అంత చిరాగ్గా... మోటుగా వుండే పోలయ్య మరోవారం పసిపిల్లాడిలా పక్క కదలకుండా పెద్దగా మాటామంతీ లేకుండా పడివుండేటప్పటికి మరింతగా కుంగిపోయింది కాంతం.

పోలయ్య ఏమీ అయిపోడని తెలుసు. ప్రమాదం దాటిందనీ తెలుసు... అయినా ఆరాటం. వాడు తొందరగా లేచి మామూలుగా తిరగాలని ఆతృత. ఎన్నో దణ్ణాలెట్టింది... ఎన్నో మొక్కులు మొక్కింది.

మొత్తానికి పదిహేనో నాటికి పోలయ్య పూర్తిగా కోలుకున్నాడు. మామూలుగా రిక్షా తీసుకుని బైలుదేరాడు.

"ఇంకా వొంట్లో వోపిగ్గా లేదు... యిప్పుడే బండెయ్యటం ఎందుకు...." అంది కాంతం.

అయినా వినిపించుకోలేదు పోలయ్య. "ఫరవాలేదులేవే..." అన్నాడు.

వాడు పాకముంధు నుంచి బండి తీస్తుంటే తృప్తిగా చూస్తూ నిలబడింది.

★ ★ ★

మరో వారానికి పోలయ్య పూర్తిగా కోలుకున్నాడనిపించాక, ఓరోజు పొద్దున్న పోలయ్య రిక్షా తీస్తుంటే పాక తలుపేసి తనూ రిక్షా ఎక్కింది కాంతం.

"ఎక్కడికే...." అన్నాడు.

"బస్స్టాండ్ కాడికి...." అంది.

బస్స్టాండ్ దగ్గర దింపాడు పోలయ్య.

రిక్షా దిగాక " నాకు పువ్వులు కొనిపెట్టు..." అంది.

"ఇంకా బేరమేం కాలేదు.... నా దగ్గర డబ్బు లెక్కడియే...." అన్నాడు.

"యియిగో తీసుకో..." అంది జాకెట్టు లోంచి రూపాయి తీసిస్తూ.

"ఎ(ర్రిముఖం యీ పూలకోసం యిక్కడిదాకా వొచ్చింది...." అనుకున్నాడు పోలయ్య పూలుకొనిస్తూ.

"రాత్రి బేగే వస్తావా...." అంది పూలు తీసుకుంటూ కాంతం.

"అలాగే" అంటూ ముందుకెళ్ళాడు పోలయ్య.

★ ★ ★

పాక తలుపు వోరవాకిలిగా వేసుంటే లోపల యెవరేనా వున్నారేమోనని కాస్సేపు తటపటాయించాడు పోలయ్య.

వుంటే తలుపు మొత్తం ఏసే వుంటదిగా అని తలుపు తోశాడు.

దీపం బాగా పెద్దదిగా వుండటం వల్ల వెలుగ్గా వుంది. వంట చేస్తున్న కాంతం అలికిడికి లేచి బయటకొచ్చింది.

కాంతాన్ని చూసి చూడగానే పక్కుమని నవ్వాడు పోలయ్య. ఆ తర్వాత పగలబడి మరీ నవ్వాడు.

"ఏంటా నవ్వు" అంది కోపంగా కాంతం.

"లేకపోతే ఏంటేఅది యీకలు పీకిన కోడిలా" అన్నాడు నవ్వాపుకుంటూ కాంతం గుండువేపు చూస్తూ పోలయ్య.

"ఛీ కళ్లు పోతాయి. నువ్వు బతికి బైటపడితే వెంటనే వొస్తానని చిన్న తిరపతి మొక్కా..." అంది.

"ఏం మొక్కే నీ ముఖం..." అన్నాడు పోలయ్య మళ్ళీ నవ్వుతూ.

"వూరుకోమంటుంటే ఏంటా నవ్వు... అయినా నీకెందుకు... నా యిష్టం... ఆ దేవుడి దయవల్ల అన్ని దెబ్బల్నించి బతికి బైటపడ్డావు...." అంది కాంతం మరింత రుసరుసలాడుతూ.

పోలయ్య నవ్వటం పూర్తిగా మానేశాడు.

"మొక్కు బాగానే వుంది. నాకు తగ్గటం బాగానే వుంది. కానీ అసలు సంగతి ఆలోచించావా.... యీ గుండేసుకునుంటే నీ దగ్గర కెవడొస్తాడే... మళ్ళీ తలొచ్చేదాకా నీ యాపారం కొండెక్కినట్టే...." అన్నాడు.

కాంతం కూడా వులిక్కి పడింది ఆ మాటలకి వో నిముషం, 'యీ డబ్బు గొడవా... యీ బేరాల గొడవా ఆలోచించనే లేదు...' అనుకుంది.

'ఏంటి... ఏం చేస్తావు...' అన్నట్టు అలాగే చూస్తూ నిలబడ్డాడు పోలయ్య.

"బేరాలు లేకపోతే లేకపోతాయి... ఎవరూ రాకపోతే, నువ్వూ పెట్టకపోతే పస్తులుంటాను.... వొక పూటే తింటాను... తిండే మానేస్తాను... అంతేకానీ నువ్వూరికే నవ్వక్కర్లేదు..." అంది ముక్కులు ఎగబీలుస్తూ...

దీపానికి దగ్గరగా.... యీ డబ్బు గొడవల్ని కాసేపైనా జయించిన ప్రేమమూర్తిలా నిలబడున్న కాంతాన్ని, కాంతం బోడితలని, ముక్కులు ఎగబీల్చి ముటముటలాడుతున్న దాని ముఖాన్ని చూస్తుంటే మళ్ళీ నవ్వొచ్చింది పోలయ్యకి.

"పిచ్చిముండా చాల్లే.... చేసింది చాలుగానీ వూరికే ఏడవకు...." అన్నాడు దగ్గరకొస్తూ.

ఆ పాకలో ఎన్నో రోజులు, ఎన్నో రాత్రుళ్ళు గడిపినా అలా నిలబడున్న పోలయ్య కౌగిలి ఎరగని కాంతం, వాడి గుండెలకి దగ్గరగా జరిగింది.

దాని కళ్ళ తడి తన గుండెలకి తగుల్తుంటే మరింత దగ్గరికి తీసుకున్నాడు పోలయ్య.

- *స్వాతి మాసపత్రిక, జూన్ 1977 (కథల పోటీలో బహుమతి)*